# చలిచీమలు

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

[సుప్రసిద్ధ కథకులు శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఇటీవలే దివంగతులయారు. వీరు తమ పెక్కు రచనలతో ఆంధ్రపత్రిక ఉగాది సంచికను, భారతిని అలంకరించారు. ఇది వీరి చివరికథ. వీరు దివంగతులు కావడానికి తొమ్మిదినాళ్ల ముందు ఇది మా కార్యాలయం చేరింది.
—సంపాదకుడు]

"ఏరగటి రాతిలా చదికిల బడ్డావు గానీ—కనపడదూ? గేటు తెరవ్వేం"

అంటూ ఉరిమాడు దివాంజీ సారథి కంగారుగా వెనక్కి విరగబడి కళ్లాలు బిగబట్టి, మేఘాల మీద యెగిరిపోతున్న గుర్రాల వడి తగ్గిస్తూ

కాపలా మనిషి కదల్లేదు.

మాటే ఆడలేదు

ఇటయినా చూడలేదు.

"కోతిలాగ నాగలెక్కి యెగిసెగిసి పడుతున్నావు గానీ, వడి తగ్గించి పాటికి" అంటూ గదిమాడు కూడా పొణకబుట్టలా జవజవలాడిపోతూ.

కళ్లాలతో యెగబట్టుకున్న చేతు లెగబట్టుకునే వుండి "ఆ" అంటూ రంకె వేశాడు సారథి, పళ్లు పటపటాడిస్తూ.

అతని కళ్లు జోతు లయిపోయాయి

బధిరాంధకం జమీందారీ పుట్టాక, దివాంజీసారటుకి, గవనిలోనే అటకాయింపు తటస్థపడడం నాలుగు శతాబ్దుల కిదే మొదటి మాటు

ఊహలకున్నా అందని సన్నివేశం యిది

ముప్ఫయ్యేళ్లు నిండలే దింకా రంగరామానుజం బహద్దరుకి

చదవంటలేదు గాని పేషన్లు మాత్రం చాలా హెచ్చు అతనికి.

వేట—వెలది—వెల్లగుర్రం—ఇంతే అతని లోకం.

పోనీ అంటే, ఇరవై రెండేళ్లు పూర్తిగా నిండలేదు గాని వళ్లు మాలిన గుండెజబ్బు, మహారాణీ ప్రత్యూషరాణికి

కానయితే, ఎం. ఏ, పట్టం పుచ్చుకుం దామె, ఐండన్లో.

కాని వేసవి నాలుగు మాసాలూ నీలగిరీ, తక్కిన ఎనిమిది మాసాలూ బెంగుళూరూ—ఇవి తప్పిస్తే ప్రాణం నిలవ దామెకి

ఈ నీలగిరీ చాలక, ఈ బెంగుళూరూ చాలక సరాసరీ స్విట్జర్లాండుకే పరుగెత్తవలసిన అవస్థ పుడుతూ ఉంటుం దామెకి, ఏటా.

అయితే అయిందంటే, కోట విడిచే చాలా దినా లయింది డవేజరు మహారాణి బంగారయ్యాదేవి

యాభై యేళ్లకూ ఒకటో రెండో తక్కువే—అయినా, వెనకటి మహారాజు—తన మామగారు కోరి వేయించుకున్న పూల తోటలో—కొలని గట్టున ఉన్న పురాతనం బంగళా పడగొట్టించి అదివరకే ఉన్న రెండూ చాలక అద్భుతమైన కొత్త మేడ కట్టించుకుని అందులో ప్రవేశించి ఉం దామె.

తన భర్త చనిపోయిన యీ నాలుగై దేళ్ల నుంచీ హద్దూ పద్దూ లేని భక్తీ ప్రపత్తీనీ ఆమెకి

ఆ మేడకి వెడితే యే గుమ్మాన వెడితే యెక్కడికి వెడుతుందో యెవరూ తెలుసుకోలేరు.

ఎవరికోసం వెళ్లామో, వా రెక్కడ ఉన్నారో చెప్పగలవారు కూడా యెవరూ ఉండ రక్కడ

ఆ మేడలో యెన్నో అపురూప వస్తువు లున్నా యంటారు, వాటి స్వరూప స్వభావాలు చెప్పగలవా రెవరూ ఉండ రక్కడ.

అటు పేషనూ, యిటు భోజనమూ అయేదాకానూ, అయాకా గూడా, ఒళ్లు తెలియని గాఢనిద్ర ఆమెకి

సాయంత్రం యిక చీకటి పడుతుం దనగా జోడు గుర్రాల బగ్గీ మీద దేవాలయానికి వెళ్లడమూ, మదన గోపాలస్వామి ప్రసాదం నేతి గారెలు నాలుగై దారగించడమూ, బసకి వచ్చి తొమ్మి ద్దాటాక మళ్లీ స్నానంచేసి పడమటావు పాలు అర్ధశేరో ముప్పావు శేరో పుచ్చుకోడమూ,—అది మొదలు పూళ్లో రెండో ఆట సినీమాలో ఆటలు రెండు కూడా ముగిసేదాకా పురాణం కాలక్షేపమూ—ఇవి తప్పించి మరో వేలంబం కూడా లే దామెకి.

ఇలాంటి కారణాలవల్ల కోటలో, దివాంజీకి ఏమి టనడిగేవా డెవడూ లేడు

మహారాజు క్కావలసిన వస్తువు లెప్పటి కప్పుడు సమకూరుస్తూ ఉండడమూ, మహారాణీ తంతి కొడితే—డవేజరు మహారాణీ కూడా వర్తమానిస్తే ఇద్దరికీ కావలసినంతా డబ్బు పంపిస్తూ ఉండడమూ—ఇవి తప్పిస్తే, మునిగిపోయే మరేమీ లే దతనికి

బలవంతం చేసి—వంగోబెట్టించి వీపున పిడిగుద్దులు గుద్దించి—వొళ్లున్నా వొలిపించి రైతులవల్ల పన్నులు వసూలు చెయ్యడం వెన్నతో పెట్టిన విద్య అతనికి

కలెక్టరు మొదలు గవర్నరు దాకా—అప్పుడూ అప్పుడూ గవర్నర జనరలు దాకా కూడా సర్కారు ఆఫీస ర్లందరూ కులదైవా లతనికి

డలాయతు మొదలు—పనిమనిషిన్నీ మొదలు మానేజరు దాకా సంస్థానం మనుష్యు లందరూ కుక్కిన పే లతనికి

ఇలాటి వాడికి,—పెద్ద కాసా లచ్చబ్బాయి మాత్రం మెడమీద తలకాయ ఉన్న మనిషిలా కనబడుతున్నా డతనికి ఒకటి రెండేళ్లనుంచి.

లచ్చబ్బాయి చిన్న చెల్లెలు డవేజరు మహారాణీకి ప్రీతిపాత్రురాలు కావడమూ,—అలా అయిన ఒక్క వారం దినాలకే మహారాజుకి భోగిని అయిపోడమూ—దీంతో దివాంజీకి బ్రేకువడ్డ ట్టయింది

ఒక్కొక్కనాడు, దారీ తెన్నూ కనబడక—ఉపాయం తోచక—కుతకుత ఉడికిపోతాడు—గిజగిజ తన్నుకుంటాడు—లబో లబో మొత్తుకుంటాడు కూడా.

## 2

పక్కకి వాలి చూశాడు సారథి కాలిమీద కాలు వేసుక్కూచుని యేదో కాగితం చూసుకుంటున్నాడు దివాంజీ

ఎంతో ఆత్రంగా—ఏకాగ్రంగా చూసుకుంటున్నాడు కనక అతని ధోరణి తనకేసి తిప్పుకోవాలి అందుకోసం గంట గణగణ లాడించాడు

తానే వెళ్లి కొని పట్టుకువచ్చా డది, స్వయంగా బొంబాయి వెళ్లి.

రాజధాని చింతజువ్వలపాలెంలోనే కాక, చుట్టుపక్కల మరికొన్ని పల్లెల్లో కూడా మారుమోగి పోతుం దది కాలే మాత్రం అదివినా

పిడుగులు పడుతున్నట్టున్న ఆ గణగణకు ఉలిక్కిపడ్డాడు దివాంజీ

మొగం పైకెత్తి చూడగా, తాను చిరాకుపడే గవనిలోనే ఆగివుంది సారటు.

గేటు బార్లా తెరిచేవున్నా, ఏకబిగిని చర్రుమంటూ వెళ్లిపోడానికి వీలులేక ఎంత మందకొడి గుర్రాలూ కూడా మెల్లిగా నడవాలా మళుపు తిరిగేదాకా.

అంచేత ఆ స్థలం అంటే, మొదణ్నుంచీ—ముఖ్యంగా తాను మానేజ రయినప్పణ్నుంచీ చాలా నిరసన భావం ఏర్పడివుంది దివాంజీకి.

అక్కడ ఆగిపోయినందున ఒళ్లంతా చీమలూ, జెర్రెలూ పాకుతున్న ట్టనిపించింది అతనికి

కాగా "ఏమిరా ?" అంటూ రంకె వేశా డతను, ఓరగా చూస్తూ

"గేటు బిగించేశాడు, పొగాకు బొండం చుట్టుకున్నాడు, గంట కొట్టినా, పిలిచినా లేవడంలేదు బాబయ్యా, కాపలా మనిషి—"

"కునికిపాట్లు పడుతున్నాడా ?"

"కూని రాగాలు కూడా తీస్తున్నా డండి"

" .. నల్లనావా అ అడే, గొల్ల పిల్లనావా అడే" అంటూ సన్నగా పాట వినపడింది దివాంజీకి

"బండిలో ఉన్నవా రెవరో తెలుసా ?"

"పెద్ద మహారాజులుంగారి తరవాత ఒక్క తమరు తప్ప యీ బ్రూహాం బండిలో మరెవరూ యెక్కరని తెలియనివా రెవరు బాబయ్యా, దివాణంలో?"

ఆలోచించాడు దివాంజీ

వంగిన్నీ చూశాడు పక్కకి.

మనిషే కనబడలే దక్కడికి.

"ఇప్పటికీ అలాగే ఉన్నాడా ?" అని మళ్లీ అడిగా డతను, చెవు లొర జేసుకుని.

"అలాగే ఉన్నాడు దొరగారూ."

"వొళ్ళు వొలిపించేస్తాను"

ఇలారా అంటూ వూగిపోయాడు దివాంజీ

బండికి బండి అంతా జవజవ లాడిపోయింది, దాంతో.

అది గుర్తించి, తాను బండి దిగివచ్చి తలుపు తెరిచి తావొక పక్కగా వొసరిల్లి నుంచున్నాడు సారథి

కన్నెత్తి చూడకపోవడం—

పిలిస్తే పలక్కపోడం—

చూడకేపోడం—

తలమునక లయిపోయిం దాగ్రహం దివాంజీకి

మహారాజుని తప్పించి మరెవణ్ణయినా, ఖరాగా నిలవబెట్టేస్తాడు తాను

మరి, తనకూ అలాంటిదే తటస్థపడనా, తాను నిరసించే చోట ?

పరిపరి విధాల పోయింది దివాంజీ మనస్సు

తన స్థితి యెవరయినా చూస్తున్నారేమో ?

నవ్వుకుంటున్నారు కూడా నేమో ?

పత్రికల కెక్కిపోతుందేమో యీ వార్త సచిత్రంగా ?

అటూ యిటూ చూశాడు, దివాంజీ

వెనక్కిన్నీ చూశాడు తిరిగి

కోపాతిశయంతో వొణికిపోతూ పళ్లు కొరుక్కుంటూ బండి దిగా డతను

## 3

పొగలు కక్కుతున్నాయి దివాంజీ కళ్లు.

నిటాగ్గా నుంచున్నాడు బండి దిగీ దిగడంతోనే, రెండు చేతులూ కోటు జేబుల్లో కుక్కుకుని

"ఎవ్వడ్రా అక్కడా ?" అంటూ ఉరిమాడు కూడా సులోచనాల కిందుగా చూస్తూ.

మాటలో కూడా కనపడింది వొణుకు

తాను కూడా వొణికిపోతున్నట్టు గవనిలో ప్రతిధ్వనించింది ఉరుము.

"నేను కాకరపర్తి గద్దన్నని" అంటూ బదులు వచ్చిం దప్పటికి, విర్లక్ష్యంగా.

"దిక్కున్న చోట చెప్పుకో" అన్నట్టుంది ఆ జవాబు నవ్వడి.

నిలువునా మండిపోయాడు దివాంజీ

అధికార దర్పం బుస్సుమంది టీకొటిల్లోనుంచి ఆవిరితో పైకి చిమ్మే తుంపురు ల్లాగ.

"ఏం కొరడా దెబ్బలు కావాలా ?" అనడిగాడు దివాంజీ, గొంతు చించుకుంటూ.

క్రోధంతో స్తబ్దం అయిపోయి, అక్షరాలు స్ఫుటంగా పలకలేక పోయింది, నాలుక, చివరికి.

ఇది చాల దన్నట్టు "హ—హ్హా—హ్హా" అంటూ వికటాట్టహాసం వినిపించింది గవను మళుపు తిరిగి వచ్చి.

"ఆ రోజులు వెళ్లిపోయాయి" అనిన్నీ మాట కూడా వచ్చింది, బహు కటువుగా, దాని వెంబడే

దివాంజీ నోరు తెరుచుకుంది, దాంతో.

"ఆ" అంటూ గదమాయింపున్నూ బయలుదేరిందా నోట గాలి అయిపోయి

సారథి వొణికిపోయాడు, సప్రయత్నంగా.

కళ్లు మూతలు పడ్డాయి దివాంజీకి

"కమ్యూనిస్టుల చేతుల్లో పడ్డా రా నౌకర్లు ?" అన్న అనుమానం వచ్చిం దతనికి, వెంటనే

మహారాజా తాగుమోత్తనం గుర్తించి సెంట్రల్ గవర్నమెంటు, మద్రాసు గవర్నమెంటు పరంగా హఠాత్తుగా వచ్చి, బధిరాంధకం జమీందారీ స్వాధీన పరుచుకుంటోందా ?" అని కంగారున్నూ పట్టుకుంది

మహారాజా సంగతి అంతా నిజమే, మరి, తన కుట్రలూ, తన దౌర్జన్యాలూ, తన బాధ్యతారాహిత్యమూ, తన అవినీతినో ?

పోనీ తన గతి యేమి టిక ?

మనస్సు క్రోధఘూర్ణితం అయిపోడమే కాదు, ఇలా కూడా తపా తపా కొట్టుకుం దతని హృదయం

అయినా, వొళ్లు మాత్రం మండిపోతూనే వుం దతనికి

పెదవులున్నూ వొణికిపోతూనే ఉన్నాయి

ఏదయినా తాడుముక్క— పూతికపుల్ల—చింతబెత్తం దొరుకుతుం దేమో అని కళ్లు చికిలించుకుంటూ అటూ యిటూ చూడసాగాడు, దివాంజీ

సారథి కూడా వెదకసాగా డదీ గుర్తించి.

అప్పటి కరుగు దిగాడు, కాపలా మనిషి

పొగాడు బొండం చేతిలోనే వుంది, అక్కడే నిలవబడ్డాడు, గ్రీవా భంగాభిరామంగా చూస్తూ

వాడి సావధానత గమనించి "గేటు తెరువు" అన్నాడు సారథి, చించుకుంటూ

"ఏం, వినపడిందా ?" అన్నాడు కాపలా మనిషి నుద్దేశించి గొంతు చించుకుని దివాంజీ కూడా

"గేటు తెరవడానికి వల్లకాదు" అంటూ గదిమాడు, కాపలా మనిషి, తల యెగురవేసుకుంటూ

అంటూనే, చుట్ట నోట బెట్టి, మొన కొరికి దుపుక్కున ఉమ్మే శాడు కూడా, కరుగ్గా చూస్తూ

దాంతో చీకట్లు కమ్మేశాయి, దివాంజీ కళ్ళ.

తెల్లని అంచుల నల్లని కారుమబ్బు కమ్మేసిన నడిమింటి సూర్య బింబం అయిపోయిం దతని మొగం

చుంయి మనిపోయిన ట్టయిపోయిం దతని దర్పం, నీళ్లు చల్లిన కొరకుంచులాగ

కాని, "ఏమిట్రా సంగతి ?" అని వొక ప్రశ్న వచ్చేసిం దతని నోట అప్రయత్నంగా.

అందుకే యెదురు చూస్తున్నట్టు "దేవిడీ మన్నా" అయిపోయింది, మరి" అంటూ తల జాడించుకున్నాడు కాపలా మనిషి.

అనేసి యెదురొమ్ము విరుచుకున్నాడు కూడా.

కొయ్యయిపోయాడు దివాంజీ.

## 4

బాగా వయసు మళ్ళినవాడు దివాంజీ.

వెండితీగ లయిపోయి వున్నాయి, పల్చబడిన్నీ బుగ్గ మీసాలు.

వచ్చిదవడ లయిపోయి వుంది మొగం కూడా, కొంచెం

కాని, యెన్నో డక్కామొక్కాకీలకు తట్టుకుని నిలిచివున్నా డతను.

అతనికీ బాగా తెలుసు, అధికారం నివ్వరిముంటిమీద నిలిచి వుంటుందని.

అయితే, యెంతెంత తుఫానులకున్నో తట్టుకోగల దది

రెల్లుపువ్వుల్లాగ వూగీనలాడుతుందే గాని, విరిగి పడిపో దది సాధారణంగా.

అయితే ఆరోజు వచ్చిందా ?

ఆ క్షణమున్నా వచ్చిందా ?

కొన వూపిరే చాలు, విరిగి, తునిగి, యెగిసిన్నీ పడిపోడానికి

చూడ శక్యం కాకుండా వుంటుంది కళ్ళు పొడుస్తూ, వెయ్యివాట్ల బల్బు.

మరి, విద్యుత్తు కట్టుబడిపోతే ?

ఉరుకులు వేసుకుంటూ వచ్చి కమ్మేస్తుంది, అంధకారం.

కాటుకలా అలుముకునిన్నీ పోతుంది, ఆ బల్బునే.

అజాపజా లేకుండా చేస్తుంది కూడా.

అయితే, ఆ బల్బూ, అధికారం వూడిపోయిన అధికారి మొగమూ ఒకటే రాశి

కాని, కాచి దించేసిన పాలకుండ, దివాంజీ.

బుడగలు వస్తూనే వుంటా యాకుండలో.

స్వయంభువు అయిన దివాంజీ వ్యక్తిత్వం కొంచెం జాగృతం అయిందా సమయాన, అలాగ

వూగిపోయా డతను

తూలిపోయాడు కూడా.

ఆత్రంగా చూశాడు బ్రూహాం కనపడలేదు, తానే దిగింది

వెనక్కి తిరిగి బాగా పరకాయించగా, రౌతుని పడదోసి ఉరకలు పెడుతున్న మదగజంలా వెళ్ళిపోతోం దది

ఇందాకటి వాడే సారథి, గంట గణగణ లాడిస్తూ, కొరడా విసురుతున్నాడు నొగలెక్కి కూచుని.

అయితే వెల్లకితలా పడిపోయినా, ఆ క్షణాన రౌతు చూపు చాలా నిశితంగానే వుంటుంది

దెబ్బ మీద పడిపోతుందన్న కంగారు—అవమానాగ్నిజ్వాలల ఉరుకులు—అసహాయత—అయినా శౌర్యం పొంగు—పరాభవావేగం—ఇన్నిటితో కుమిలిపోతూ వుంటుం దా రౌతు మానసిక వ్యవస్థ

మొగం మరోవైపు తిప్పుకోగా, ఎక్కడికో పోతోం దొక వొంటెద్దు బండి ఆ సమయాన

కాళీగా వెడుతోంది

ఏకాంతం కావా లిప్పుడు దివాంజీకి.

నగుబాట్లు—జాలి—ఈసడింపులు—నిరసనబాణాలు—ఇలాంటివి తన మీద పడకుండా ఒక్క ప్రాకారం కావా లిప్పు డతనికి.

వీరాధివీరుల కుండవలసిన లక్షణాల్లో వేగం ఒక్కటి.

కత్తి దూసి మీది కురకడానికి లాగే, పోటు తప్పించుకుని మళ్ళీ విజృంభించడానికిన్నీ అది వుండాలనీ వీరుడైనవాడికి

జాతి దురదృష్టవశాన, కత్తి ఝుళిపించడానికే అకాశావేశ్యం అయిపోయాయి అతను పుట్టా టప్పటికే

విజాతీయుల ఆక్రమణలు వచ్చాక బుద్ధిబలానికే యెక్కువ చురుకుదనం అయింది మనవాళ్ళకి

శరీరదార్ఢ్యాని కింకా లోటు లేదు దివాంజీకి.

నరాల బింకమూ వుంది కలం పోటుకి బాగా అలవాటుపడి ఉన్నాడు కనక, అతను.

ఇప్పుడే నవనవోన్మేషంతో వుం దది

కాగా, యిటు తిరిగి వొక్కాటే వురుకురికా డతను.

ఆ ఉరకడంలో ఆ వొంటెద్దు బండిలో పడ్డాడు, వడిసెలబెడ్డలాగ "మా యింటి" కంటూ

అంటూనే బోర్లా పడుకున్నాడు కాళ్ళు చాపేసి, మొగమున్నా తాటాకు చాపలో గుచ్చేసుకుని

ఆ పాటుతో చక్రున లేచిపోయింది, బండికాడి

పంతులు పిక్కలు దీర్ఘాలేమో పాపోసుకాళ్ళు రోడ్డుకి తగిలాయి.

తుళ్ళిపడ్డాడు ముందున్న బండిమనిషి.

మళ్ళీ కిరాయి యెక్కడ దొరుకుతుందా అన్న ఆందోళనలో వున్నా డతను.

టాపు తగిలి బోడితల టక్కుమం దతనికి

బల్ల చెక్కమీద యెగిసిపడ్డంలో పిర్రలు బాగా కమికాయి

ఎలాగో నిలవరించుకుని — పక్క తడిక పట్టుకుని వెనక్కి తిరిగి చూడగా—తన బండిలో ఆ చివరి నుంచి యీ చివరి కెవరో వొక మనిషి.

సరిగంచుల పాగాతో—బుగ్గమీసాలతో—అచ్చంగా దివాంజీ.

చలిచీమల నన్నట్టు, వందలకు వందలు—వేలకు వేలు—లక్షలకున్నా లక్షలకు లక్షలున్నా మనుషులను నేలను బెట్టి రాసేసిన బధిరాంధకం దివాణం దివాంజీ

కళ్ళు చెదిరిపోయా యా మనిషికి.

నోరు తెరుచుకుంది

గుండెలు పీచు పీచు మన్నాయి.

"ఏమ్, నిద్రపోతున్నావా ?" అంటూ బీటుకానిస్టేబులు గదిమే దాకా వొళ్ళే తెలియలే దతనికి

## 5

పరవళ్ళు తొక్కేశాడు కావలా మనిషి గద్దన్న

చేతు లెగరవేసుకున్నాడు

కిలకిల్లాడిపోయాడు, యుద్ధరంగాన వీరవిహారం చేసే జాతి గుర్రంలాగ

తరవాత తెరిచేశాడు గేటు బార్లా, పరకాయించి చూస్తూ

రెండో గేటు మధ్య—అటువైపు గేటు మధ్య నుంచుని మళ్ళీ కిలకిల్లాడిపోయాడు, దివాంజీ వెళ్ళిపోయినట్టు చెయ్యూపుతూ.

ఈ స్థితి తెలుసుకోడానికి—దేవిడీ యెదట కనిపెట్టుకునివున్న మనిషి కూడా దేవిడీకేసి తిరిగి చిందులు తొక్కేశాడు" "మహవా, నారంగా, వహవా, నారంగా" అంటూ

మండువా తెరపిలో నుంచుని చూస్తున్నాడు, పెద్ద కాసా లచ్చబ్బాయి

క్షణాలు యుగాలుగా నుంచున్నా డాత్రపడుతూ.

ఈ చిందులు చూశా డతను

ఆవేశం పట్టలేక పోయాడు

"స్పైబాన్" అంటూ పెద్ద కేక వేసి, ఎడమకాలి మడమమీద గిరా—గిరా తిరిగేశాడు "నారంగా—నారంగా" అంటూ.

వెంటనే అట్నుంచి గుమాస్తాలూ, యిట్నుంచి రాణేదారులూ, అన్ని గదుల్లోంచీ సుబేదారులూ, సముద్దారులూ, మానేజరూ, నౌకర్లూ, సందులోనుంచి దాసీ సుందరీమణులూ వచ్చి చుట్టుకున్నా రతణ్ణి

వెంటనే పైకి చూశా డోమాటు, తలపాగా పడిపోకుండా చేత్తో అదుముకుని.

అక్కడ పిట్టగోడ ఆనుకుని వున్న ఒక జవరాలు, చెక్కిట చెయి చేర్చి, కళ్ళు మూసుకుని, తల వంచుకుంది, బాగా, నిద్ర అభినయిస్తూ

"మహా బాగా జరిగిపోయిం" దంటూ అందుకున్నాడు, లచ్చబ్బాయి ఆవేశంతో

"పొక్కిందంటే పీకలమీదికి వచ్చే వ్యవహారం యిది. గప్‌చిప్ ! లచ్చబ్బాయి సెలవు లేకుండా యే మాటా దివాణంలోనుంచి బయటపడ్డానికి

వెళ్ళకాదు. లచ్చబ్బాయి ఆజ్ఞ లేకుండా దివాణంలోకిస్నీ రావడానికి వల్ల కాదు

"దివాంజీమాట యెవరైనా అడిగితే యేమీ తెలియదని చెప్పండి. మహారాజే అడిగితే, నూటనాలుగు డిగ్రీల జ్వరం అని చెప్పండి. దివాంజీయే అడిగిస్తా డెవరినైనా పంపించి. తానే అడుగుతాడు ఇంటికి పిలిపించి. మహారాజుకి పడిశం పట్టిందని చెప్పాలి మెడ్రాసునుంచి యూరపియన్ డాక్టర్లు వచ్చారనీ, ఎవరితోనూ మాట్లాడవద్దన్నారనీ, ఎవరికీ కనపడనే వద్దన్నారనీ చెప్పాలి. ఎవరితో ఏమి మాట్లాడినా యిది మనసులో పెట్టుకునే ఉండాలి. ఇందుకు తగ్గట్టే మాట్లాడాలి నాదారు గాళ్ళందరూ "మాకేం తెలుస్తుంది బాబూ" అని యెదురడగడమే జవాబు. తరవాత ఏం జరగాలో అది లచ్చబ్బాయి చెబుతాడు నెమ్మదిమీద కబడ్దార్! ఏమండోయి మేనేజరుగారూ! లచ్చబ్బాయంటే ఎవరో తెలిసిందా మీ కిప్పుడు? జాగ్రత్త. మీతో సహా పరివారాని కంతకీ ఆరేసి నెలల జీతం బహుమతీ ప్రకటిస్తున్నాను ముందుగా. అందరూ దర్బారుహాల్లో చేరుకోండి ఒయ్యోయ్! రామస్వామీ, ఈపాటికి తయారయి ఉంటుంది, అందరికీ, పీకలమొయ్యా పేమ్యా పాయసం యిప్పించు ఓరి వెంకటస్వామీ, అత్తర్లు—గంధాలు—తాంబూలాలు—దండిగా సిగరెట్లూ—లంకాకు చుట్టలు—బీడీలు—సిద్ధం చేయించు. ఏమండోయ్ మానేజరుగారూ, తాంబూలా లంటే వొట్టి తాంబూలాలు కావు ఖజానా తెరిపించండి" అని చెప్పాడు దృఢంగా.

"నువ్వు మహా బాగా ఆడావు నాటకం" అంటూ కాకరపర్తి గద్దన్నని బాగా నిమిరాడు.

"నీ అనుభవం అంతా కనపరిచేశావ్. చక్రవర్తుల దగ్గిర ఉండతగ్గ వాడవు నువ్వు" అంటూ సారధిని కూడా చాలా ఆగ్రహించాడు.

# 6

మహారాజరాజశ్రీ శ్రీ రాజా భూపాళం సత్య శ్రీ నామదేవనానక్పంద వీరవెంకట సూర్యనారాయణ జగన్నాథ రామభద్ర రాధా మాధవ నరసింహ చింతామణి మల్లికార్జున మహాదేవ పాండురంగ చాముండీశ్వర వీర హనుమంత హరనాథ సాయి లక్ష్మీనారాయణ బలదేవ అప్పల నరసింహ కుక్కుటేశ్వర పోతురాజ రంగ రామానుజం బహద్దరు అటు కళ్ళు తెరిచాప్పటికి, ఇటు గోడమీది గడియారం మధ్యాహ్నం నాలుక్కొట్టింది.

బంగరుసలాకలను మించిన యిద్దరు పడుచులు పొదివి పట్టుకొని లేవదీసి మంచంమీదే కూచోబెట్టా రతణ్ణి. అతనే చేతు లందించగా.

మరో యువతి మంచంమీద, అతనికి వెనకగా కూచుంది అతణ్ణి తన మీదికి వాల్చుకుని.

"బాగా నిద్రపట్టింది" అన్నా డతను, చేతులూ, కాళ్ళూ బాగా పట్టు వదిలేసీ, కళ్ళు తెరుచుకునీని.

"మే మనుకుంటూనే ఉన్నాం, రాత్రి నిద్ర చాలింది కాదు మహాప్రభూ" అంది మరో పడుచు, ఎదుటికి వచ్చి, మొగాన మొగం పెట్టీ, మీదిమీదికి వంగీని

వెంటనే రెండు చేతులూ ఆమె మెడకి చుట్టవేశా డతను.

బాగా చూశాటప్పటికి ఆమెని పట్టుకుని అతనూ, అతణ్ణి పట్టుకుని ఆమె లేచి నుంచున్నారు, మంచానికి చేరబడి

అప్పటి కప్పుడే మరో పడుచు వచ్చి కరిగిపోయిన కెంపు లన్నట్టున్న పానీయం ఒకటి అతని నోటి కందించింది

బాగా మెళుకువ వచ్చింది మహారాజుకి, దాంతో.

కళ్ళూ పూర్తిగా విడ్డాయి.

గ్రీష్మభానుని ప్రచండ కిరణాల్లా అతని చూపులు మిలమిల్లాడాయి.

"లచ్చబ్బాయ్" అన్నా డతను, యువతిని పొదువుకునే ఉండి, మొగం మాత్రం అటు తిప్పి

"హాజర్ మహాప్రభూ" అంటూ మొగం యెదటికి వచ్చాడు లచ్చబ్బాయి వంగి చేతులు వలుపుకుంటూ.

"దివాంజీ" అన్నాడు మహారాజు, రెప్పలార్చుకుంటూ.

"చిత్తం చిత్తం మహాప్రభూ" అన్నాడు లచ్చబ్బాయి, అంజలి బంధం వూపుకుంటూ

"మాట రాదేం?" అంటూ గదిమాడు మహారాజు కళ్ళు మూసు కునే ఉండి

"చిత్తం మహాప్రభూ, ఇంకా రాలే దివాళ"

"బుద్ధిలేదు నీకు" అని మళ్లీ గదిమాడు మహారాజు.

"అపరాధిని మహాప్రభూ?"

"ఎంత తొందరపనుందో తెలుసా?"

"కానలేకపోయాను ప్రభూ!"

"టైమెంత?"

"నాలుగు మహాప్రభూ!"

"ఇవాళ రానేలేదూ యింకా."

"చిత్తం దేవరా రాలేదు"

"కబురు పంపావా?"

"నాలుగుమాట్లు పంపాను దేవరా!"

"ఏమంటాడు?"

"నూటనాలుగు డిగ్రీల జ్వరంలో ఉన్నారు బాబయ్యా"

"ఖైద తిరీ—మరి చెప్పావు కావేం?"

"మనవి చేసుకుంటాను బాబయ్యా!"

"ఎప్పుడు?"

"దివాణానికి బయలుదేరారంట బాబయ్యా పదింటికే బయలుదేరారంట. కాని, బండి యెక్కబోతూ తూలిపోయారంట. పక్కనే ఉన్న సారధి పొదివి పట్టుకున్నా డంట. "అబ్బా, తల నొప్పి" అంటూ వెనక్కి వెనక్కి వెళ్లి కుర్చీలో పడిపోయారంట"

"అదంతా జ్వరమే?"

"చిత్తం చిత్తం కళ్ళు విడ్డం లేదంట. శిరస్సున కట్టిన మంచుగడ్డ క్షణంలో వేడెక్కిపోయిందంట"

"డాక్టరేం చేస్తున్నాడు?"

"అక్కడే ఉండిపోయారు పడిపోయినప్పణ్నుంచీని. అప్పత్రి అంతా అక్కడే ఉందంట"

"డాక్టరేమన్నాడు?"

"రెస్టు కావా లంట న్యూమోనియాలోకి దింపవచ్చునంట."

మహారాజు కళ్ళు చిమచిమ లాడాయి

"ఇప్పు డేమిటీ చెయ్యడం చాలా తొందరపనుందే?"

"చిత్తం చిత్తం తెల్లవారాటప్పటికి హాజరుపెడతాను, మమ్మేలిన వారి పాదాల దగ్గిర"

"రాళ్ళమడుగు జవాబు వెళ్లిందా?"

"నిన్ననే వెళ్ళింది మహాప్రభూ" అందొక యువతి మహారాజు మొగాన మొగం పెట్టి.

"ఏమని?"

"రేపు పొద్దు గూకాటప్పటికి మనం మాటులో ఉంటామని."

"మహారాజు మొగం ప్రసన్నం అయింది.

"ఎవరది?" అని ప్రశ్నించాడు.

"నేను మెరుపుతీగను మహాప్రభూ"

"మీ అక్క కూడా వస్తోంది, తెలుసా?"

"చిత్తం చిత్తం"

"లచ్చబ్బాయ్"

"చిత్తం చిత్తం మహాప్రభూ!"

"మీ పెద్ద చెల్లెలు కూడా వస్తోంది. ఈవిధంగా మనకి సంబంధం కలిశాక అన్నయ్యగారు రావడం యిదే మొదటిమాటు"

"చిత్తం చిత్తం చాలా గొప్ప సన్నివేశం మహాప్రభూ."

"అన్నయ్యగా రొక్కరే అయితేనూ ఆ మాట."

“చిత్తం, బోధపడింది మహాప్రభూ.”

“దివాంజీ మాకూడా ఉండాలి, తెల్లవారా టప్పటికి”

“ఉంటారు బాబయ్యా”

“ఏమాత్రం అశ్రద్ధ చేసినా మాటతక్కదని కబురు పంపు తాక్కరుకు”

“చెప్పే పంపాను” అంది మెరుపుతీగ.

మహారాజు మొగాన హాసరేఖ మెరిసింది.

“సరే” అన్నాడు కాలెత్తి

పడుచులు స్నానాలగదిలోకి అడుగు వేయించా రతణ్ణి.

## 7

కభురుమీద కభురు—నాలుక్కభుర్లు రాగా, దివాంజీ చిన్నకూతురు పదేళ్లపిల్ల కూడా వచ్చి, ధరణా కూచోగా స్వయంగా కారు నడుపుకుంటూ బయలుదేరాడు లచ్చబ్బాయి.

“తమరు రాకపోవడంవల్ల మామూలు పనంతా ఆగిపోయి—కాఫీ పుచ్చుకోడాని క్కూడా అవకాశం లేకుండా ఉంది తమరు కభురు చేయించాలా ? చివరికి చెల్లెమ్మగారిని కూడా పంపాలా ? ప్రభువు దేవిడీమన్నా ఆవేశారని తెలిసింది కుప్పగా కూలిపోయాను. ‘తొరగా తొరగా’ అంటూ తొందర చేశారు మేనేజరు నాకు ప్రపంచం తెలియటలేదు ఎన్ని విధాల చూసినా ప్రభువుని విడిచిపెట్టడానికి వీల్లేకుండా ఉంది పది నిమిషాలు—తెక్కపెట్టి సెల విప్పించారు చివరకు” అంటూ యెదటికి వెళ్లగా “ఏమిటీ యీ ఉపద్రవం ?” అంటూ అడిగాడు దివాంజీ, లచ్చబ్బాయి నేకాంతానికి తీసుకు వెళ్లి.

“ఎప్పుడూ అనుకోలేదు అనుమానమే లేకపోయింది చిచ్చర పిడుగులా వచ్చి పడింది మాట”

“పిడుగు కాక ? పూలదండా బాబయ్యా యిది ? నా కయినా కలిగిందా యేమాత్రం అయినా అనుమానం యెన్న డయినా ?

“కొంచెం చూచాయగా నైనా నీకు తెలిసివుండాలోయ్.”

“శివశివా ! తమరు నమ్మరు”

“నమ్మ రంటే—నమ్మలేక—”

“అంతే అంతే బాబయ్యా ! తమరూ నమ్మలేరు ఎవరూ నమ్మలేరు. మహారాజయినా, దేవిడీమన్నా అనాలనుకునిన్నీ ఉండరు, నా మాట నమ్మండి దొరగారూ”

“అవునుగదా ? పోనీ నావల్ల తప్పు—”

“తప్పా ? తమ వల్లనా ? శ్రీహరీ, నోరు రాదు బాబయ్యా !”

“. . . . . . . . . .”

“రామా, రామా”

“. . . . . . . . . . . .”

“తమవంటి దివాంజీ మరే మహారాజు దగ్గిర బాబయ్యా ?”

“. . . . . . . . . .”

“తమరు గనక సరిపోయింది గానీ, ఈ గడ్డుదినాల్లో పాకేజీమీద పాకేజీ తెప్పించడం మరే దివాంజీకి సాధ్యం బాబయ్యా ?

“నిన్న సాయంత్రానికి నాలుగు పాకేజీలు వచ్చి వుండాలి కదా ?”

“వచ్చాయి బాబయ్యా, వచ్చాయి కనకనే నాకీ బెంగ !”

“నిమిష నిమిషానికీ నిషా ఉండాలి గదా ?”

“అదయినా వెల్లగుర్రమే కావాలి కదా ?”

“ఎప్పు డయినా నీమీద కోప్పడ్డా ననుకో—”

“కోప్పడితే ? అది నా మేలుకే గదా ? ఆమాత్రం అయినా వొళ్ళు తెలియడం లేదనా బాబయ్యా నాకు ?”

“హృదయం విప్పి చెప్పేస్తాను మెరుపుతీగ విషయం నేనేమి పలకం వేస్తున్నానో—”

“దానిమీద తమకున్న మమకారం నాకు తెలియనిదా ?”

“ఇంకేం మరీ ? నువ్వే కాదు మీ అమ్మా కనిపెట్టలేకపోయింది. చూడూ. ఇలాంటి సంగతులు పెదవి దాటితే పృథివి దాటుతాయి”

“అదీ చెప్పాలా బాబయ్యా ?”

“మహారాణీ యెలాగా సనిపెట్టదు మహారాజుని ఒక్క సంవత్సరం—తప్పితే రెండు అక్పటికి నీ చెల్లెలు ఎవ్ ఏ అయిపోను చులాగ్గా.”

“అదీ తెలుసు నాకు.”

“తెలుసుండి యేమి ప్రయోజనం ?”

“నౌకరీవాళ్లం గదా బాబయ్యా ?”

“నా సంకల్పం—నా యెత్తుగడ—భగవంతుడిక్కూడా తెలియదు.”

“సందేహమా ?”

“మహారాణీ విడాకుల ప్రయత్నంలో ఉంది.”

“చిత్తం”

“రిజిస్టరు మారేజీ వద్దంటే—కొంచె మయినా గ్రహించగలిగారా మహారాజు ?”

“చిత్తం చిత్తం”

మెరుపుతీగ మహారాజుకి ఉంపుడుకత్తె కావడం మంచిదో మహారాణీయే కావడం మంచిదో గుర్తించలేకపోయావు”

“ప్రస్తుతం సంగతి చూడాలి బాబయ్యా ! తమకు దేవిడీమన్నా అని విన్నది మొదలు గోల పెట్టేస్తున్నారు నౌకర్లు”

“అవును గదా ? అక్కర్లేదు పొమ్మంటే యెంత బాగుండునూ ? మచ్చ గదా యిది ?”

“సందేహమా ?”

“అరవై యేళ్ల వయస్సులోనా యిది ? నలభై యేళ్లుగా నా రక్తం అంతా ధారపోశాను గదా ?

“నే నెరగనా బాబయ్యా ?”

“అయితే మహారాజు అనుగ్రహం పూర్తిగా తప్పినట్టేనా ?”

“నా నమ్మకం మనవి చేసుకోమంటారా ?”

“చెప్పవోయ్.”

“మహారాజు తమర్ని విడిచి వుండలేరు”

“నీకూ అలాగే తోచిందీ ?”

“తోచక ? ఎవరికి మాత్రం మరేమి తోస్తుంది బాబయ్యా ? ఎంత హఠాత్తుగా దేవిడీమన్నా చెప్పారో అంత హఠాత్తుగానూ తమ పాదాలు—”

“పట్టుకుంటా రంటావు మహారాజు ?”

ఇలా అడిగినప్పుడు దివాంజీ మొగాన ఆత్మవిశ్వాసం గప్పుమంది.

“పట్టుకోక ? నే నొక్కటి చెబుతాను బాబయ్యా ?”

“ఏమంటావ్ ?”

“ఈవారం సరిపోతాయి నిన్న వచ్చిన పాకేజీలు. మరి తరవాత ?”

“నా నోటనే పొడిచిందా పొద్దు ?”

“పొడిచాకా ఆ మాట.”

“ఏమయినా, యిక మన కేమీ వద్దోయ్ ?”

“శివశివా !”

“అంతే అంతే. నువ్వేమీ చెప్పవద్దు గప్‌చిప్ ! ఏమంటావు ?”

“సెల విప్పించండి”

“తిన్న అన్నం వొంట బడుతోందా ఒకనా డయినా ? వేల్సు యువరాజు మెచ్చుకున్న తెలివితేటలు బ్రాందీబుడ్ల సంపాదనకే గదా ఇక్కడ వినియోగం ?”

“అంత రాచకార్యా లేమి ఉన్నాయి బాబయ్యా మరోచోట మాత్రం?”

“నిజమే. ఇప్పటి ప్రభువులు—”

“మరి యిప్పటి దివాంజీలు ?—”

“హోహో, చాలా దూరం విసిరావు అంతే అనుకో. నా సారంసం మీదే విరక్తి పుడుతోంది నాకు”

“విద్యార్థులు సెల విప్పిస్తున్నారు బాబయ్యా ?”

"లేదు లేదు నా కొక్కందుకే కించ. మరేంలేదు దేవిడీమన్నా అనక తల కొట్టించేస్తే మంచిది నమ్మినచోట. అందుకు బాధపడుతున్నాను"

"ఏమయినా బధిరాంధకం జమీందారీ తమ చేతిమీదుగా ఏలుబడి కావలసిందే"

"అది నీ కోరిక, నాకు తెలుసు."

"ఒక్కటి మనవిచేసుకో మంటారా ?"

"చెప్పవోయ్."

"పెద్ద మహారాజు చచ్చిపోయాక వాలుగేళ్ల యీమధ్యన విషాలేని విమిషం—"

"ఎక్కడిదీ ? అది నీకు పూర్తిగా తెలుసు"

"అవును గదా ? కనక వారం తిరగదు బాబయ్యా."

"వారమే తిరగదూ ?"

"తిరగదండి."

"వాకు నమ్మకం లేదోయ్ నీకు సాధ్యం కానిది లేదనుకో"

"ఇంకే ? తమ రలా సెల విప్పించారు కనక, మళ్లీ తమరు దివాణంలో ప్రవేశించాకే నేను వచ్చి మంచినీళ్లయినా పుచ్చుకోడం"

"నువ్వనవలసిన మాటే అన్నావు అయితే, నిరాశ చేసుకోవద్దంటావు"

"వద్దు వద్దు. నౌకరీవాణ్ణి నా చేతిలో లేదనుకోండి కాని ఒక్కటే వారం"

"వారం అన్న వ్యవధి యేమిటీ ?"

"రాళ్లమడుగు బాబయ్య వేటకు దయచేస్తున్నారు"

"ఇక్కడికా, ఇద్దరూ కలిసి మరెక్కడి కయినానా ?"

"మరెక్కడికో అయితే నేను రావడని కింత ఆలస్యం ఎందుకూ ?"

"ఎప్పుడు దయచేస్తారు ?"

"ఎప్పుడోనా ? ఈ రాత్రే కూచుంటారు మాటులో"

"అంత తొందర యేమి వచ్చింది ?"

"ప్రభువులకు తొందర అంటే ఏమిటి, నెమ్మది అంటే ఏమిటి ? బుద్ధిపుట్టింది, బయలుదేరారు"

"బయలుదేరారూ ?"

"మా పెద్ద చెల్లెలు కూడా—"

"వస్తోందా ?"

"దాంతే యీ సరదా ?"

"సెబాస్ !"

"ఇక్కడ మా చిన్నచెల్లెలు మెరుపుతీగ కూడా"

"బయలుదేరుతుందా ?"

"ఆ"

దివాంజీ చూపు మారింది

మనస్సులో ఏదో వూహా—సంకల్పం పొటమరించింది.

అది కనిపెట్టాడు లచ్చుబ్బాయి

"సెల విప్పించండి"

"పదపద నా కిది తెలియదు నిన్ను తొందరపెట్టాను"

గంభీరంగా చూస్తూ—వాలకం కనిపెడుతూ—వెనక్కి తిరిగాడు లచ్చుబ్బాయి

"సరే పద"

రెండడుగులు వేశాడు, లచ్చుబ్బాయి

అంతలో ఆగిపోయి "వేట కాగానే కలుసుకొందాం" అన్నాడు దివాంజీ

మొగం మాత్రం వెనక్కు తిప్పి "చెప్పాలా బాబయ్యా" అన్నాడు లచ్చుబ్బాయి.

అతను కూడా మరో రెండడుగులు వేసి "సెలవు బాబయ్యా" అన్నాడు నేల అంటి కళ్ల కద్దుకుని

"ఏదో పతకం వేశాడు పంతులు. అక్కడ తానే కాళ్ళు పట్టుకుంటాడు" అనుకుని పెద్ద పెద్ద అంగలే వేశాడు అతను కూడా.

## 8

అనుకున్న సమయాన వేటకి బయలుదేరాడు, మహారాజు, రంగ రామానుజం బహద్దరు

ముదురాకుపచ్చ ట్వేడుసూటు ధరించివున్నా డతను

ఇటు సూటు రంగులోనూ, అటు సాయంకాలపు రంగులోనూ సమంగానే ముదురుతోంది నీలిమ

వేటకుక్క లొక వాను నిండా ఉన్నాయి, తొక్కుకుంటూనూ తోసుకుంటూనూ, కరుచుకుంటూనూ, గెంటుకుంటూనూ, మధ్యమధ్య ఒక్కొక్కటి మొరుగుతూనూ.

దానికీ, మహారాజుకోసం సిద్ధం చెయ్యబడివున్న కారుకీ హిల్‌మాన్‌కీ మధ్యగా పాతిక ముప్ఫయి మంది సంస్థానం వేటకా ళ్లున్నారు. చెరకాకు బల్లేలు ధరించి కొందరూ, ముకుందగిరి బల్లేలు ధరించి కొందరూ, శూలాలు ధరించి కొందరూ ఈటెలు ధరించి కొందరూ, ఎప్పుడెప్పు డన్నట్టు ఆత్రంగా చూస్తూ

వారి తరవాత జోడుగుళ్ల తుపాకీలు ధరించి కొందరూ విచ్చుకత్తులూ, కటార్లూ, పుచ్చుకుని కొందరూ, మహారాజు సొంత వేటకాళ్లున్నారు. శిరస్సులకు వేట టార్చీలు తగిలించుకుని

వారి తరవాత రాళ్లమడుగు వేటకాళ్లు నిలిచివున్నారు, చింతజవ్వలపాలెం వేటగాళ్ళ శక్తిసామర్థ్య లంచనా వేసుకుంటూనూ, వారిని మించిపోవా లనుకుంటూనూ

కారుకి పక్కగా పట్టుతెరలు కప్పిన మేనా, సుసజ్జితం అయివుంది, దాసీ సుందరీమణులతో పరివేష్టితం అయి.

మేనాకి పక్కగా మహారాజు వేటగుర్రం, కళ్లెం కొరుక్కుంటూనూ, తల యెగరవేసుకుంటూనూ, ఉరుముతున్నట్టు మధ్య మధ్య సకిలిస్తూనూ ఖురఘట్టనతో రోడ్డు తవ్వుతూనూ, వెనక్కీ, ముందుకీ అడుగులు వేసుకుంటూనూ నుంచుని వుంది

రెండుపక్కలా ఎందరో గ్రామీణ బాలకులూ, బాలికలూ చెదరువాటుగా వృద్ధాంగనలూ, పూరి యువకులూ నుంచుని ఉన్నారు, ఏమిటేమిటో చర్చించుకుంటున్నా

వందా—వందయాభయి మంది చాకళ్లు కాగడాలూ, నూనె సిద్దెలూ పుచ్చుకుని తమలో తాము హెచ్చరించుకుంటూ అటూ యిటూ తిరుగుతున్నారు

అంతా సిద్ధం అయిందన్న సంగతి తెలుసుకుని హుస్సేను సాహెబు, వెన్ను విరుచుకుంటూ రీవిగా ముందుకి వెళ్లి బాకా పట్టడానికి సిద్ధంగా వించుని ఉన్నాడు

వెంటనే పెట్రోమాక్సు లైట్లు వెలుగున కదన కుతూహల రాగం కీర్తన స్వరకల్పన చేసుకుంటూ సన్నాయిపాటగాళ్లు వచ్చారు

వారి వెనకనే వచ్చారు చెయ్యీ, చెయ్యీ పట్టుకుని మెరుపుతీగ, మహారాజాను

వారి వెనకనే వచ్చాడు జోడుగుళ్ల గజబంధనం తుపాకీ మెడకి తగిలించుకుని లచ్చుబ్బాయి

వెంటనే మెరుపుతీగా, మహారాజూ కారెక్కి కూచున్నారు రాసుకుంటూ.

బాగా విప్పారి ఉన్నాయి, వారి మొగాలు

తమవంటి ఒక జంటనే కలుసుకోబోతున్నారు వారు

అందుకూ ఆ మెప్పుదల వారి మొగాల

విశేషించి తన అక్కని కలుసుకోబోతోంది మెరుపుతీగ.

చిన్ననాడు, మెరుపుతీగ కూడా తన అక్కలాగ, ఒక మహారాణీస్థానీయురా లవుతుందని యెవరూ అనుకోలేదు

తానూ అనుకోలేదు ఆ అక్క, తన చెల్లెలి జీవితం యేదారి పడుతుందో అని ఆందోళన పడిపోతూనే వుంది కూడా

పైగా ఆమె ఒక మహారాణీస్థానీయురా లయిన తరువాత కూడా యింతవరకూ చూసివుండలేదు మెరుపుతీగను.

మెరుపుతీగ ఉత్సాహం పూరికే కాదు, తన అక్కకి తీసిపోని దర్పా తోనే తా నామెని కలుసుకోబోతున్నందుకు

ఆమె ఉత్సాహం క్షణక్షణానికీ ఉత్తరంగితం అయిపోతోంది, తన మొగాన, ఒక్కొక్క గర్వరేఖ ముదిరినకొద్దీ

మహారాజు మొగమూ ఆనందతరంగితంగానే ఉంది కాని అతని ఆనందంలో విషమరేఖ అంకితం అయింది

అతని అనుచరులు కూడా అదేమా అనుకున్నారే గాని అదేమిటో గుర్తించుకోలేకపోయారు

ఈ స్థితిలో లచ్చబ్బాయి వచ్చి తన మెడలో ఉన్న జోడుగుళ్ల తుపాకీ మహారాజు మెడకి తగిలించాడు

వెంటనే "గోన్" అన్నాడు మహారాజు.

కాని ఎవరూ కాలు కదపలేదు

"చెల్లీ, నువ్వు పాలకీలో కూచో అమ్మాయి యివ్వాళకి" అన్నాడు లచ్చబ్బాయి, మెల్లిగా

"అదేం?" అనబోయాడు మహారాజు, మెరుపుతీగను పొదివిపట్టుకునే ఉండి.

కాని మాట రాలే దతని నోట

లచ్చబ్బాయి తన వంశమర్యాద నిలవడానికే అలా అన్నా డను కున్నాడు మహారాజు

ధర్మరక్షణకు కంకణం కట్టుకుని వుండాలి మహారాజయిన వ్యక్తి.

ధర్మానికి సాయం అనూచాన సంపత్తికిన్నీ లోబడి ఉండాలి మహారాజయిన వ్యక్తి.

కాని అది అలా ఉండడంలేదిప్పు డెక్కడా

మహారాజుకేసి పులుకూ, పులుకూ చూసింది మెరుపుతీగ.

మహారాజు కూడా అలాగే చూశాడు మెరుపుతీగకేసి


ప్లాస్టిక్ సంచులు

తినుబండారములు, బట్టలు, కెమికల్సు, మెషినరీ వగైరా భద్రపరచుటకు పోలిథిన్ (ప్లాస్టిక్) సంచులనే వాడండి. ఇవి అన్ని సైజుల్లోనూ తయారు చేయబడుచున్నవి.

★

జనతా ప్లాస్టిక్ ఇండస్ట్రీస్

—: ప్రొప్రయిటరు :—

నాళం రామలింగయ్య ఫోన్: 221

నాళం వారి వీధి, :: కాకినాడ.


లచ్చబ్బాయయినా బదులు చెప్పలే దెవరికీ

అతని మొగం చాలా గాంభీర్యం వహించింది.

"ఇక్కడే కూచుంటాను బాబూ" అన్న సరదా కనపడింది మెరుపుతీగ మొగాన

"ఏమంటా?" వన్న భావం కనపడింది మహారాజు మొగాన

"ఇక్కడే కూచోనియ్యి" అన్న ప్రార్థనా కనపడింది

లచ్చబ్బాయి మాత్రం వల్లకా దన్నట్టు కరుగ్గా చూశాడు

"అప్పటికే ఆలస్యం అయింది" అన్న గదమాయింపున్నూ కనపడింది.

మహారాజు మోహం వంచుకున్నాడు

దానికి సాయం వెంటనే తలుపులు తెరిచాడు లచ్చబ్బాయి

వెంటనే మెల్లిగా కారు దిగి మెరుపులాగ వెళ్లి పాలకీలో కూచుంది మెరుపుతీగ

పాలకీ యెత్తుకున్నారు బోయీలు, లచ్చబ్బాయి ఇంగితం కనిపెట్టి.

డ్రైవరు హారన్ వేశాడు

హుస్సేను సాహెబు ఉరుముతున్నట్టు బాకా పట్టాడు

వందా—వంద యా భై కాగడా లొక్కమాటు గప్పుమన్నాయి.

వెంటనే హారన్ నొక్కాడు లచ్చబ్బాయి, కారెక్కి మహారాజుకి తగల కుండా వంగి

వాన్ కదలడం చూసి వేటకుక్కలు మొరిగాయి

"కొట్టు" "పొడు" "కాల్చెయ్యి" అని బొబ్బలు పెట్టారు వేటకాళ్ళు.

డప్పులూ, తప్పెటలూ ఒక్కమాటు బోరుకలగేయి

ప్రస్థానం బయలుదేరింది

చోపుదారులున్నూ గుర్రా లెక్కారు, ప్రస్థాన సందర్భోచితంగా జయ ధ్వానాలు చేసుకుంటూ

కారున్నూ కదిలింది

కాని, పది గజాలు వెళ్లాక రోడ్డునే—సూటిగా దూసుకు పోయింది.

పాలకీ, పరివారమూ, కాగడాలూ, వేటకాళ్లూ మాత్రం అడ్డదారిన పడ్డారు

## 9

పూర్తిగా పొద్దు గూకింది.

చీకట్లు బలిశాయి.

జనసంచారం వుడిగింది.

ఘంటాపథాన రాతిపొరలు తగిలినప్పుడల్లా గుర్రపు డెక్కల తాకుళ్ళ ఆకాశం అంటుతున్నాయి

చూపు మందగించడంతో కళ్ళున్నూ మూసుకుని "ఎక్కడున్నాం యిప్పుడు?" అనడిగాడు మహారాజు

"చిరాలగుంట చెరువు దాటాం మహాప్రభూ" అన్నాడు లచ్చబ్బాయి.

మలుపు తిరిగింది కారు

పక్కకి ఒరిగాడు మహారాజు అప్రయత్నంగా.

విసిరేసిన ట్టయింది

"ఇదేమి" అన్నాడు కళ్ళు తెరచి వ్యర్థంగా చూస్తూ.

"నక్కల కాలవ గట్టెక్కాం బాబూ" అన్నాడు డ్రయివరు.

"ఇంకా యిక్కడే ఉన్నామా?" అనడిగాడు మహారాజు

ఆ మాటలో ఆత్రం స్ఫురించింది

"నిమిషం బాబూ" అంటూనే వడెక్కించాడు డ్రైవరు.

కారు శరవేగాన పోతోంది

వెనకనుంచి జీపొకటి తరుముకు వచ్చింది, రాకాసి లైట్లతో.

"అదేమిటి?"

"దివాణం నౌకర్లు వస్తున్నారు బాబూ ఎందుకో" అన్నాడు లచ్చబ్బాయి

లైట్లు ఆర్పుకుని సమీపించింది జీపు

పక్కకి చూస్తూ వడి తగ్గించి కా రాపాడు డ్రైవరు.

జీపూ ఆగిపోయింది
హెడ్‌లైట్లు వేశాడు లచ్చబ్బాయి.
ఎదటికి మాత్రమే టార్చిన్నీ వేశాడు.
అప్పు డడిగాడు "ఏమిటి సంగతి?" అని మెల్లిగా

"దివాంజీవారు కాలం చేశారు బాబూ" అన్నాడు జీపులో వచ్చిన ఒక మనిషి

"చచ్చాడూ ?" అన్నాడు మహారాజు.
పళ్ళు కొరుకుతూ అన్నాడు.
చాలా విసుగ్గా ఉం దామాట
"సరే ఎవరది మానాజరుగారా ?"
"అవునోయ్"
"దరిద్రుడు ఆయన బతుకే అంత" అన్నాడు మహారాజు.

"ఎప్పుడూ మంచి సమయానే యిలా చేస్తూ వస్తున్నా డాయన యేదో" అనిన్నీ చెండుకున్నాడు

"వెనక్కి వెళ్లిపొండి బాబూ!" అన్నాడు లచ్చబ్బాయి.
కారు ముందు కురగ్గా, జీపు అలాగే ఉండిపోయింది
గాలి విసురు తట్టుకోలేకుండా ఉన్నాడు మహారాజు
ఎదట—జీబుగా పెరిగివున్న చెట్లున గప్పుమం దొక టార్చి.
"అదేమి" టన్నాడు మహారాజు, చకితుడయి
"కొరివిదయ్యం అయివుంటుంది వీరాధివీరా' అన్నాడు లచ్చబ్బాయి.
మహారాజు కొంచెం వణికాడు
"ఇక్కడ ఉన్నాయా అవిన్నీ" అనడిగాడు కూడా

"ఉన్నట్టే చెప్పుకుంటారు మహాప్రభూ, ప్రజలు" అన్నాడు లచ్చబ్బాయి, మహారాజు దగ్గిరగా డేకుతూ.

"ఏమి చేస్తా యవి ?"

"మనిషిని చుట్టుకుంటాయి. అధికంగా ఉంటే చుట్టుకుంటాయి భయపడితే చిందులు తొక్కుతాయి కేకలు, కూతలు ఒకటేమిటి, గందరగోళం చేసేస్తాయి బాబూ" అన్నాడు డ్రైవరు.

"చేసి ?"

మేకలాగ అరచింది తుప్పచాటున ఒక కొరివిదయ్యం లేచి.

గతుక్కుమన్నాడు మహారాజు

"మెరుపుతీగ ఉందిగదా ముందు ?"

ఇలా అడుగుతూ వణికిపోయాడు మహారాజు.

"భయంలేదు బాబూ, అడ్డదారిన వెళ్లాయి, పాలకీ, పరివారమూ, గుర్రాలూను" అన్నాడు డ్రైవరు

"ఆ దారిలో లేవు మహాప్రభూ, దయ్యాలు" అన్నాడు, లచ్చబ్బాయి.
"కారు మాత్రం యిలా యెందుకు రానిచ్చావు ?"

ఆత్రంగా అడిగాడు మహారాజు.

"తారువేసిన రోడ్డుకదా, త్వరగా వెళ్లవచ్చుగదా అని."

ఇలా అనడం తడవుగా అల్లంత దూరాన రోడ్డు కొక పక్కగా నుంచుంది ఒక కొరివిదయ్యం, పళ్ళికిలిస్తూ

గడగడలాడిపోయాడు మహారాజు

లచ్చబ్బాయి పొదివి పట్టుకున్నాడు మహారాజుని.

కాలవవైపుగా రెండు కొరివిదయ్యాలు లేచాయి, అటుతిరిగి, నక్కకూత కూస్తూ ఒకటీ, కుక్కలా మొరుగుతూ ఒకటిన్నీ

డ్రయివరు భుజం పట్టుకున్నాడు మహారాజు కళ్ళు మూసుకుని.

జీబుగా పెరిగివున్న చెట్టుకి దగ్గరగా నుంచునివున్నా డొక మనిషి

వెంటనే బాగా అదిమి పట్టుకున్నాడు లచ్చబ్బాయి మహారాజుని, వదలకుండా.

కారు లైట్ల వెలుగు తట్టుకోలేక అటు మొగంగా తిరిగా డా మనిషి.
అలా తిరగడంలో బుగ్గమీసాలు మెరిశాయి

వెంటనే పక్కనుంచి వచ్చి ఒక కొరివి దయ్యం అతని యెదుట నుంచుంది

పది పదిహేను దయ్యాలు చుట్టుకున్నాయి కూడా తుపాకీ గురికి ఎడంగా

మహారాజు ఎదటే కొరి వాడించిం దొక దయ్యం, పక్కగా నుంచుని.

గిజగిజలాడిపోయాడు మహారాజు

"భయంలేదు బాబూ" అంటూ మరింత గట్టిగా పట్టుకున్నాడు లచ్చబ్బాయి.

ఆ పట్టుకోడంలో తుపాకి ముందుకి గురిపెట్టాడు కూడా
"బాబూ, బాబూ" లంటూ కలియతొక్కుకోసాగాడు ఆ మనిషి.
"అదెవ ?" రన్నాడు మహారాజు

"ఎవరోకాదు మహాప్రభూ, దివాంజీవారు బ్రహ్మరాక్షసయి వచ్చారు బాబూ, పట్టుకుందామని" అన్నాడు లచ్చబ్బాయి

మహారాజు మరింత గట్టిగా పట్టుకున్నాడు "తుపాకి సరీగా గురిపెట్టి, కాల్చండి బాబూ" అంటూ.

ఆ మనిషి చుట్టూ బొబ్బలూ, చిందులూ [redacted]పెట్టాయి, కొరవి దయ్యాలు, మీదిమీదికి కొరవులు తిప్పుతూ.

మనిషి కంకాళాల్లా ఉన్నాయవి

"కాల్చెయ్యి" అనరిచాడు మహారాజు, రెండు చేతులా మొగం కప్పుకుని

తుపాకి ఢామ్మంది

కొరివిదయ్యాల బొబ్బల్లో హా అన్న మనిషి ఆర్తనాదం లీనం అయిపోయింది

మనిషి నేలగూలిన చప్పుడున్నూ అయింది
ఇంతలో కొరవులన్నీ ఆరిపోయాయి, కాలవవైపున తప్పుకుని.
పడిపోయిన మనిషి చేతి టార్చి పగిలిపోయి ఆరిపోయింది.
లచ్చబ్బాయే వేశాడు టార్చి
అది వూపాడు కూడా
ఒక కొరివి దయ్యం వచ్చి, పళ్లికిలిస్తూ తలుపు తీసింది.
దానిమీది కురుకుతున్నట్టు కారు దిగేశాడు లచ్చబ్బాయి, హుమ్మంటూ
జర్రుమంది కారు.
రెండు ఫర్లాంగుల దూరాన ఆగింది మలుపులో

* * *

క్షణంలో పది కొరవులు గప్పు మన్నాయి
వంగి పడిపోయిన మనిషి చెవిదగ్గర నోరు పెట్టాడు లచ్చబ్బాయి.
వూగిపోతూ ప్రారంభించాడు కూడా.

"బలవంతుడ నా కేమని
పలువురితో నిగ్రహించి పలుకుట మేహాలా
బలవంతమైన సహస్రము
చలిచీమల చే—హా—త జి—హిక్కి ఛావదే సుమతీ!"

అంటూ వూగిపోయాడు కూడా.
వూగుతూనే "గద్దన్నా" అన్నాడు.
కంకాళం డ్రెస్సు తీసేసుకుంటూ ఎదటికి వచ్చాడు గద్దన్న.
"బాగా విను" అన్నాడు లచ్చబ్బాయి.
"నక్కల కాలవ వూబిలో పాతిపెట్టం ఈ మనిషిని. భద్రం గప్‌గప్" అనిన్నీ అన్నాడు
అన్నా డంతే. టార్చి వేసుకుని కారుకేసి వురకలు పెట్టేశాడు.